సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



పరిశ్రమ ప్రారంభానికి సిద్ధం
గోపవరం మండలంలో ఏర్పాటు చేస్తున్న సెంచురీ పానెల్స్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. శంకుస్థాపన చేసిన రెండేళ్లకే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. - 8లో



కదులుతున్న డొంక
తంబళ్లపల్లి నియోజకవర్గంలోని పెద్దతిప్ప సముద్రం మండలంలో మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంలో ఆడిట్ బృందం తీగ లాగితే డొంక కదులుతోంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /21.2

వాతావరణం
జిల్లాలో సోమవారం 21.2 - 30.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలో ఈ నెల 20న (బుధవారం) సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను 995922 5848 అనే నంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సాప్‌లో గానీ తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

వైవీయూలో క్రీడా జట్ల ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో క్రీడా జట్ల ఎంపిక డిసెంబర్ 20 నుంచి నిర్వహించనున్నట్లు క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ రామసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 20న ఖోఖో (స్త్రీ, పురుషులు), డిసెంబర్ 21న ఉదయం హాకీ పురుషులు, మధ్యాహ్నం 2 గంటలకు ఫుట్‌బాల్ పురుషుల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు, ప్రస్తుతం చదువుతున్న కోర్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. జట్ల ఎంపికలన్నీ వేమన క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వివరించారు.

రేపటి నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ నుంచి 1, 3, 5 సెమిస్టర్ డిగ్రీ పరీక్షలు ప్రారంభమవుతాయని విశ్వ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి వెల్లడించారు. జిల్లాలోని 79 డిగ్రీ కళాశాలల్లో బిఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ, బీఒక్ కోర్సులు చదివే రెగ్యులర్, సప్లమెంటరీ కలిపి 35,562 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సెమిస్టర్ల వారీగా మొదటి సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులు 7,313 మంది కాగా సప్లమెంటరీ 5324 మంది ఉన్నారన్నారు. మూడో సెమిస్టర్‌కు రెగ్యులర్ 5240 మంది, సప్లమెంటరీకి 6056 మంది ఉన్నారని తెలిపారు. ఐదో సెమిస్టర్‌కు రెగ్యులర్ 9103, సప్లమెంటరీకి 2522 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు.

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ

కడప రూరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బ్రహ్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన 60 మంది అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. శిక్షణా కాలంలో స్టైఫండ్ తోపాటు స్టడీ మెటీరియల్ ఇస్తారని వెల్లడించారు. అభ్యర్థులు తమ బయోడేటాతో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, మార్కుల లిస్ట్, కుల, రూ.1 లక్షలోపు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు సమర్పించాలన్నారు. ఈ నెల 23వ తేదీలోపు సంచాలకులు, బీసీ స్టడీ సర్కిల్, పాత కలెక్టరేట్, కడప అనే చిరునామాలో సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 9703185382ను సంప్రదించాలని వివరివంచారు.

పోటీ ప్రపంచంలో నైపుణ్యం అవసరం

కడప సెవెన్‌రోడ్స్ : పోటీ ప్రపంచంలో ప్రతి ఉద్యోగి, నిరుద్యోగులకు నైపుణ్యం అవసరమని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి జి.వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం కడప నగరం స్మిత్‌రోడ్డులోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో గ్రామీణ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి నిర్వహించిన 'డిజిటల్ అండ్ సోషల్ మీడియా అవేర్నెస్ ట్రైనింగ్ ప్రోగ్రాం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి గ్రామ సచివాలయ ఉద్యోగికి ఏడాది లేదా ఆరు నెలలకు ఒక సారి పునఃశ్చరణ శిక్షణ అవసరమన్నారు. ప్రతి పని నైపుణ్యం, వేగవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సి.రామకృష్ణయ్య, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.సుబ్బారామిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల దరఖాస్తుల స్వీకరణ

కడప అర్బన్ : కడపలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, క్యాన్సర్ కేర్ సెంటర్, పులివెందులలోని వైఎస్ఆర్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులను ఈ నెల 16 నుంచి స్వీకరిస్తున్నారు. 21వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఈ ఉద్యోగ నియామకాల్లో ఎలాంటి సిఫారసులు గానీ, పైరవీలు గానీ జరగవని, అర్హత ప్రాతిపదికన జరుగుతాయని కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపోహలు, పుకార్లు, దళారీల మాటలు నమ్మవద్దని ఆమె పేర్కొన్నారు.

సృజన వేదిక.. విజ్ఞాన దీపిక

- నేడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు
- చాపాడు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహణ
- 28, 29లలో కడపలో రాష్ట్ర స్థాయి పోటీలు

మానవ జీవితంలో నిత్యం అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. ఈ క్రమంలో పరిశోధనల ద్వారా వాటికి పరిష్కారం చూపే ప్రాజెక్ట్‌లను విద్యార్థులు రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహిస్తోంది. మొదట పాఠశాల స్థాయి, తర్వాత మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ఏర్పాటు చేస్తోంది.

కడప ఎడ్యుకేషన్ : జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు వేళయింది. మండల స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. మంగళవారం చాపాడు మండలం పల్లవోలులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ పోటీలు మూడు కేటగిరీలలోని 8 అంశాల్లో నిర్వహిస్తారు. ఇందులో భౌతిక, రసాయన, గణిత, ఖగోళ, పర్యావరణ, జీవ, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అంశాల్లో పోటీ జరుగుతుంది. వీటిలో వ్యక్తిగతంగా, గ్రూపుగా, ఉపాధ్యాయ విభాగంలో ప్రాజెక్టులను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత విభాగాల్లో పోటీ పడే విద్యార్థులు ఎనిమిది అంశాల్లో ఏదో ఒక దానిని ఎంచుకుని గైడ్ టీచర్‌తో కలిపి పాల్గొనాలి. గ్రూపు విభాగంలో పోటీ పడేవారు ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కలిసి పాల్గొనాలి. టీచర్ విభాగంలో పోటీ పడే వారు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే పాల్గొనాలి.



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్

ప్రతి మండలం నుంచి మూడు చొప్పున...
ప్రతి మండలం నుంచి మూడు ప్రాజెక్టుల చొప్పున 108 ప్రాజెక్టులు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. వ్యక్తిగత, గ్రూపు, టీచర్ విభాగాల్లో ఒక్కో విభాగం నుంచి 36 ప్రాజెక్టులు ఎంపిక చేశారు. ఇలా మొత్తంగా ఎంపికైన 108 ప్రాజెక్టులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొననున్నాయి.

ఏర్పాట్లు పూర్తి
చాపాడు మండలం పల్లవోలులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు వీలుగా టేబుల్స్ ఏర్పాటు చేశారు. అన్ని పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులు ప్రాజెక్ట్‌లను ఉంచేందుకు వీలుగా అన్ని వసతులు కల్పించారు. ఇందులో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటోలతోపాటు ఐడీ కార్డులు అందజేయనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు...
జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న వినూత్న ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఒక్కొక్క విభాగానికి ఐదుగురు జ్యూరీ మెంబర్ల చొప్పున మొత్తం 15 మంది పాల్గొని వినూత్నంగా ఉండటంతోపాటు సమాజానికి పనికొచ్చే ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ఇలా జిల్లా నుంచి 9 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. ప్రతి జిల్లా నుంచి 9 చొప్పున 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతాయి. రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు కూడా వైఎస్సార్ జిల్లాలోనే నిర్వహించనున్నారు. ఈ నెల 28, 29 తేదీలలో కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహిస్తారు.

చిన్న వయసు నుంచే..



విద్యార్థుల్లో చిన్న వయసు నుంచే శాస్త్రీయ దృక్పథం అలవడాలి. మెరుగైన జీవితం గడపడానికి సైన్స్ ఎంతో ముఖ్యం. ఈ సైన్స్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలనే లక్ష్యంలో భాగంగానే.. విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరుగుతోంది.
– బి.మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

అందరూ పాల్గొనాలి



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన ప్రతి ఒక్కరిని పంపే బాధ్యతను మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలి. ఎంపికైన ప్రతి ఒక్కరి వివరాలు గూగుల్ ఫామ్ ద్వారా అందాయి. కాబట్టి ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు.
– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

అన్ని సౌకర్యాలు



మండల స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరచిన ప్రతి విద్యార్థికి అభినందనలు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు. జిల్లా స్థాయి ప్రదర్శన నిర్వహించే చోట విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఎవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
– మార్తాల వెంకట క్రిష్టారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

విజయవంతం చేయాలి



సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి

చాపాడు : జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు వద్ద గల ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సోమవారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కమిటీ సభ్యులకు కేటాయించిన మేరకు నిర్వహణ బాధ్యతలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చాపాడు ఎంఈఓతోపాటు వివిధ మండలాలకు చెందిన ఎంఈఓలు హాజరయ్యారు.

ప్రారంభించనున్న కలెక్టర్
పల్లవోలు వద్ద ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శన పోటీలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు ప్రారంభించనున్నారు. అలాగే జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతుల ప్రదానం కార్యక్రమం ఉంటుంది.

శబరిమలైకి ప్రత్యేక సర్వీసులు

బస్సు రకం	సీట్ల సంఖ్య	కిలో మీటరుకు అద్దె
సూపర్ లగ్జరీ	36	రూ. 57
అల్ట్రా డీలక్స్	40	రూ. 61
ఎక్స్‌ప్రెస్	49	రూ. 62



కడప కోటిరెడ్డిసర్కిల్ : శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బ్యాచ్‌లుగా వచ్చిన వారికి కోరిన రూట్లలో తక్కువ చార్జీతో బస్సులను నడుపుతామని ఆయన పేర్కొన్నారు. గురుస్వామి, వంట మాస్టర్, లగేజీ బాయ్, కన్నెస్వామి మొత్తం ఏడుగురికి ఉచిత ప్రయాణానికి అనుమతిస్తామన్నారు.

- అలాగే వివాహాలకు, ఇతర శుభ కార్యాలకైనా ఏపీఎస్ ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన బస్సులను నడుపుతుందన్నారు. జిల్లా వాసులు బస్సుల కోసం సమీపంలోని డిపో మేనేజర్లను కలిసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కడప డీఎం (9959225774), బద్వేలు (99592 25779), జమ్మలమడుగు (99592 25778), పులివెందుల (99592 25780), మైదుకూరు (99592 25781), ప్రొద్దుటూరు (99592 25777)లను సంప్రదించవచ్చని వివరించారు.

అరుణాచలంకు..
అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువన్నామలైకి వివిధ డిపోల నుంచి ఈ నెల 25, 26 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సు బయలుదేరుతుందన్నారు.
- బద్వేలు డిపో నుంచి 25న రాత్రి 8 గంటలకు బయలుదేరి గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా, 26న ఉదయం 5.30, 7.30 గంటలకు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా బస్సులు బయలుదేరుతాయన్నారు.
- మైదుకూరు డిపోలకు సంబంధించి పోరుమామిళ్ల నుంచి ఉదయం 6 గంటలకు మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా బస్సులు వెళతాయన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 8.30కి బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా వెళతాయన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి రాత్రి 8కి బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళుతుందన్నారు.
- పులివెందుల నుంచి రాత్రి 8కి బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలంకు బస్సు వెళుతుందన్నారు.

వైభవం.. పల్లకీ ఉత్సవం



రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి ఆలయంలో మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మాఢవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు

కడప ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి

పీలేరు రూరల్ : రాష్ట్రంలో కొత్తగా 1500 ఆర్టీసీ బస్సులు రానున్నట్లు కడప ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ సర్వీసులు నడిపి ప్రజల ఆదరణ పొందాలన్నారు. ఖర్చు తగ్గించి ఆదాయం పెంచాలన్నారు. ఆర్టీసీ అంతర్‌రాష్ట్ర ఒప్పందం కుదురుతోందని, తద్వారా పీలేరు వయా మదనపల్లె మీదుగా బెంగళూరుకు పది సర్వీసులు నడుపుతామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిపోల నుంచి 300 సర్వీసులు అరుణాచలం గిరి ప్రదక్షిణకు నడుపుతున్నామని, 500 సర్వీసులు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీలేరు డిపో నుంచి శబరిమలై యాత్రకు 15 సర్వీసులు, అరుణాచలానికి ప్రతి నెలా 20 సర్వీసులు నడిపేందుకు కృషి చేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఈ ఏడాది అరుణాచలానికి 179 సర్వీసులు నడపగా, రూ. 60 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్గో ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రూ.150 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం రాము, డీఎం కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈడీ చెంగల్‌రెడ్డి

పేదల సంజీవని 'ఆరోగ్యశ్రీ'

- వ్యయ పరిమితి రూ.25 లక్షల వరకు పెంపు
- జిల్లాలో 7.76 లక్షల కుటుంబాలకు భరోసా
- కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట సంజీవనిగా ఉపయోగపడుతోందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఆరోగ్యశ్రీ మెగా అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్లు, ఎస్పీలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నిర్వహించారు. కార్యక్రమానంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద ఇప్పటి దాకా రూ.5 లక్షల వరకు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. జిల్లాలో 7.76 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుదారులకు మేలు జరుగుతుందన్నారు. నాలుగున్నరేళ్లలో 2,64,346 కేసులకు గాను రూ.597.48 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంతకుమునుపు 1059 వ్యాధులకు మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తించేదని, ఇప్పుడు దాన్ని 3257 వ్యాధులకు పెంచారని పేర్కొన్నారు. రోగి పూర్తిగా కోలుకునే వరకు ఆరోగ్యశ్రీ ఆసరా పథకం ద్వారా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5000 వరకు ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు. జనవరి 1 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ దశ క్యాంపును నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జేసీ గణేష్‌కుమార్, ఏఎస్పీ తుషార్‌డూడి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ కమిషన్ సభ్యుడు హిదాయతుల్లా, మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ బగ్దాది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ జాబితా సిద్ధం చేస్తున్నాం
ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయరామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. సోమవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా -2024, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారుల సందర్శన, ఈ నెల 22 - 23 తేదీల్లో విజయవాడలో కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి ఏఎస్పీ తుషార్ డూడితో కలసి జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈవో ముఖేష్‌కుమార్ మీనా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిని జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ గంగాధర్‌గౌడ్, ఓఎస్డీ రఘునాథ్, పోలీస్ అధికారులు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న ఆకేపాటి



జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తబృందం

తిరుమల : శేషాచలం అటవీప్రాంతంలోని అన్నమయ్య నడకమార్గం మీదుగా భక్తబృందంతో కలిసి ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తిరుమలకు చేరుకున్నారు. ఈ నెల 15వ తేదీన రాజంపేట నుంచి వేలాది మందితో ఆయన 21వ సారి తిరుమలకు మహాపాదయాత్రను ప్రారంభించారు. శేషాచలం అటవీప్రాంతంలో నుంచి అన్నమయ్య నడిచి వచ్చిన మార్గం మీదుగా.. ఆకేపాటి సోమవారం తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ అన్నమయ్య నడిచిన కష్టతరమైన ఈ మార్గంలో 21వ సారి కాలినడకన తిరుమలకు వచ్చామని తెలిపారు. అన్నమయ్య మార్గాన్ని అభివృద్ధి చేయాలని టీటీడీని, ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. తిరుమలకు చేరుకున్న ఆయనకు ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారందరూ శ్రీవారిని ఉచిత సర్వదర్శన మార్గం ద్వారా దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో మూడు రోజులు పర్యటించే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగ్గట్లు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో సీఎం జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్నారు. అధికారికంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్ అందాల్సి ఉందన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. గోపవరం, కడప, ఇడుపులపాయ, సింహాద్రిపురం, పులివెందులలో వివిధ కార్యక్రమాల్లో సీఎం పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అధికారులకు తగిన బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఏఎస్పీ తుషార్‌డూడి, డీఆర్వో గంగాధర్‌గౌడ్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ తదివతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


జానకమ్మ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని అంబాభవాని దేవాలయం వీధికి చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు బాల వెంకటసుబ్బరాయుడు సతీమణి జానకమ్మ (103) సోమవారం ఉదయం మృతి చెందారు. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో ఇంట్లో ఉండి చికిత్స పొందుతూ సోమవారం ఉదయం తుది శ్వాస విడిచినట్లు ఆమె కుమారుడు మధుసూదన్ రావు తెలిపారు. ఈమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈమె స్వగ్రామం పెద్దముడియం మండలం పెద్దపసుపల. మంగళవారం పెన్నానది తీరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈమె భర్త బాల వెంకటసుబ్బరాయుడు వేలూరు జైలులో 6నెలల పాటు జైలు జీవితం గడిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కడపలో వ్యాపారి రూ.10 కోట్లకు ఐపీ.!

కడప అర్బన్ : కడప నగరంలోని ఓ ప్రముఖ వ్యాపారి రూ.10 కోట్లకు ఐపీ పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నో సంవత్సరాలుగా వివిధ రకాల వ్యాపారాలను నిర్వహిస్తూ ఉన్న సదరు వ్యాపార సంస్థ నిర్వాహకుడు ఇటీవల ఆర్థికంగా నష్టపోయి కోర్టులో ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. రూ. లక్షల నుంచి కోట్లలో రుణాలు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన శ్రీను

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా ఆత్మకూరు మండలం మూలమాల గ్రామానికి చెందిన బోయ శ్రీను (46)అనే వ్యక్తి గత కొద్ది కాలంనుంచి కూలిపనుల నిమిత్తం ముద్దనూరుకు వచ్చి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం కడప రహదారిలో ఓ డాబా సమీపంలో అతను వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు


గాయపడిన వృద్ధుడు

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలో రామాంజనేయపురం సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో వెళుతున్న వృద్ధుడు (60) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే అతన్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సెంచరీ పానెల్స్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధం

- ఈ నెల 23న పరిశ్రమను ప్రారంభించనున్న సీఎం జగన్
- ఏర్పాట్లపై పలుమార్లు పరిశ్రమను సందర్శించిన కలెక్టర్
- శంకుస్థాపన చేసిన రెండేళ్లకే నిర్మాణ పనులు పూర్తి


ప్రారంభానికి సిద్ధమైన సెంచరీ పానెల్స్ పరిశ్రమ

గోపవరం : బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలంలో ఏర్పాటు చేస్తున్న సెంచరీ పానెల్స్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమను ప్రారంభించనున్నారు. అయితే ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై పలుమార్లు జిల్లా కలెక్టర్ విజయరామరాజు పరిశ్రమను సందర్శించి తీసుకోవాల్సిన చర్యలపై పరిశ్రమ ప్రతినిధులు, అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021 డిసెంబర్ 23న పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సరిగ్గా రెండేళ్లకే నిర్మాణ పనులు దాదాపు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. రూ.వెయ్యి కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనుండగా ఇప్పటికే సుమారు రూ.800 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి అవసరమైన నీరు మినహా మిగిలిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. నీటి సౌకర్యం కోసం ఇప్పటికే పైపులైను పనులు పూర్తి కావచ్చాయి. ఈ నెల 23వ తేదీన ప్రారంభించబోయే పరిశ్రమ యూనిట్ల ద్వారా హైప్రెషర్ ల్యామినేట్ బోర్డ్స్, మీడియం డెన్సిటీ ఫైబర్ బోర్డ్స్ తయారు కానున్నాయి. ఇప్పటికే పరిశ్రమకు అవసరమైన రా మెటీరియల్ (జామాయిల్ కర్ర)ను సమకూర్చుకున్నారు. వైఎస్సార్ జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జామాయిల్ సాగు అధికంగా ఉండటంతో ఇప్పుడు పరిశ్రమకు అవసరమయ్యే రా మెటీరియల్ కొరత లేకుండా పోయింది. ఇంకా ఆసక్తి కలిగిన రైతులకు జామాయిల్ సాగు చేసేందుకు మొక్కలను సబ్సిడీ ద్వారా పరిశ్రమ ద్వారానే అందించనున్నారు. ఈ మేరకు రైతులకు కూడా జామాయిల్ సాగుపై అవగాహన కల్పించి గిట్టుబాటు ధరను కూడా ప్రకటించారు. రైతులు కూడా జామాయిల్ సాగు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఇప్పటికే ఈ ప్రాంత నిరుద్యోగులకు పరిశ్రమలో పలు విభాగాల్లో ఉద్యోగాలు కల్పించారు. అలాగే చుట్టుపక్కల గ్రామాల కూలీలకు కూడా ఉపాధి దొరుకుతుంది. నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతమైన గోపవరంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, ఆ మేరకు శంకుస్థాపన చేయడం, వెనువెంటనే పరిశ్రమ పనులు పూర్తి చేసి చేసిన రెండేళ్లకే ప్రారంభానికి నోచుకోవడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బద్వేలుకే సెంచరీ పానెల్స్ పరిశ్రమ తలమానికం. ఇంకా పలు పరిశ్రమలు ఈ ప్రాంతానికి రానుండటంతో మరింత అభివృద్ధి చెందడమే కాక ఈ ప్రాంత ప్రజలకు మరింత లబ్ధి చేకూరనుంది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కమలాపురం : మండలంలోని నల్లలింగాయపల్లెలో ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం స్థానిక 3వ సచివాలయ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో కడప నగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 270 మందికి ప్రముఖ కంటి వైద్య నిపుణుడు వినోద్ కుమార్ పరీక్షించి వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి చుక్కల మందు, అద్దాలు పంపిణీ చేశారు. శుక్లాలు ఉన్న వారికి పుష్పగిరి ఆసుపత్రికి తరలించి శస్త్ర చికిత్స చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఉద్యోగి ప్రతాప్ రెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు వినోద్ కుమార్



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా పలు సర్టిఫికెట్లు సత్వరమే అందుతున్నాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
–సాక్షి నెట్‌వర్క్

అమ్మ ఒడి పథకం మాకు వరం



మేము మైదుకూరు పట్టణంలోని వాసవి నగర్‌లో ఉంటున్నాం. నా భర్త సుబ్బయ్య, నేను వంట గదిలో వినియోగించే చిన్న చిన్న పాత్రలు, వస్తువులను అమ్ముతూ జీవిస్తున్నాం. మాకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. అమ్మాయిల్లో ఒకరు ఇంటర్, మరొకరు 9వ తరగతి చదువుతున్నారు. అబ్బాయిల్లో ఒకరు 5, ఇంకొకరు 3వ తరగతి చదువుతున్నారు. మేము చేసే వ్యాపారంలో ఆదాయం అంతంత మాత్రమే. దాంతో నలుగురు పిల్లల్ని చదివించడం కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం పెట్టడం మాకు వరమైంది. మా పెద్దమ్మాయి శాంతి 9వ తరగతిలో ఉండగా మొదటి సారి మాకు అమ్మ ఒడి పథకం మంజూరైంది. ఆ విధంగా వరుసగా నాలుగు సార్లు అమ్మ ఒడి కింద ఆర్థిక సహాయం నా ఖాతాలో పడింది. ఆ డబ్బు అమ్మాయి చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలును మర్చిపోం.
- జగన్నాథం అంజమ్మ, మైదుకూరు

సొంతింటి కల నెరవేరింది



కొన్నేళ్లుగా సొంతిల్లు నిర్మించుకోవాలన్న కల ఇప్పుడు నెరవేరింది. గతంలో ఇంటి బాడుగలు కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అప్పట్లో ఇల్లు కావాలని ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. మా గోడు ఎవరూ పట్టించుకునేవారు కాదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామ వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి ఇంటి కోసం దరఖాస్తు చేయించారు. రెండు నెలలకే ఇల్లు మంజూరైందని చెప్పడంతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాం. ప్రస్తుతం ఇంటి నిర్మాణం 80శాతం పూర్తి చేశాం. జగనన్న ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది.
- గువ్వల రామ తులసి, గరుగు వీధి, వేంపల్లె

రూపాయి ఖర్చు లేకుండానే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవాళ్లం. అయినా సకాలంలో వచ్చేవి కావు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్థానిక సచివాలయంలోనే అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు వలంటీర్ చెప్పడంతో నేను దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చాయని, సచివాలయం వద్దకు వచ్చి తీసుకెళ్లాలని వలంటీర్ చెప్పడంతో నేను వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాను. గత ప్రభుత్వ హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే అన్ని పథకాలు వస్తున్నాయి.
- మిరియాల ఈశ్వరమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి


ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు(రాజంపేట): ఎన్నికల ముందు దుష్ప్రచారాలు చేస్తూ అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేలా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా ఖాన్‌లు సోమవారం నందలూరు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథరెడ్డిలు టీడీపీలో చేరుతున్నట్లు కొన్ని వాట్సప్ గ్రూపుల ద్వారా నందలూరు మండలం, టంగుటూరుకు చెందిన గుజ్జల ఈశ్వరయ్య దుష్ప్రచారం చేశాడన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని నందలూరు ఎస్‌ఐకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, మన్సూర్ అలీఖాన్‌లు పాల్గొన్నారు.

ఈనెల 20,21 తేదీల్లో వైవీయూలో యువభేరి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో ఈనెల 20,21 తేదీల్లో యువభేరి పేరుతో యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్యల ఆదేశాల మేరకు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పద్మ, కల్చరల్ కో ఆర్డినేటర్ ఆచార్య రామప్రసాద్‌రెడ్డిల పర్యవేక్షణలో పలు పోటీలు జరగనున్నాయి. సంగీతం, నృత్యం, నాటకం, లలితకళలు, సాహిత్యాంశాలపై విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్, కామర్స్ బిల్డింగ్‌లోని సురభి ఆడిటోరియంలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో యోగి వేమన విశ్వ విద్యాలయం కళాశాల, విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులను 2024 జనవరి 5 నుంచి 9 వరకు వైజాగ్ ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జరిగే దక్షిణ భారతదేశ విశ్వవిద్యాలయాల యువజనోత్సవ పోటీలకు ఎంపిక చేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు పవన్‌కుమార్‌రెడ్డి 9550864584 నెంబర్‌ను సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

పోటీల వివరాలు

20వ తేదీ ఉదయం 10 గంటలకు

(సంగీత విభాగంలో)

1. క్లాసికల్ ఓకల్ సోలో(హిందూస్థానీ/కర్ణాటక) 2. క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంట్ సోలో(పర్‌క్యూషన్) 3. క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో (నాన్ పర్‌క్యూషన్), 4. లైట్ ఓకల్(ఇండియన్), 5. వెస్ట్రన్ ఓకల్ (సోలో), 6. గ్రూపు సాంగ్(ఇండియన్), 7. గ్రూపు సాంగ్ (వెస్ట్రన్), 8. ఫోక్ ఆర్కెస్ట్రా, 9. వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంటల్

సాహిత్య విభాగంలో...

1. క్విజ్, 2. వక్తృత్వం, 3. డిబేట్

లలిత కళల విభాగంలో..

1.స్పాట్ పెయింటింగ్, 2. కోలాజ్, 3. పోస్టర్, 4. క్లే మోడలింగ్, 5. కార్టూనింగ్, 6. రంగోళి, 7. స్పాట్ ఫొటోగ్రఫీ, 8. ఇన్‌స్టాలేషన్, 9. మెహింది

21వ తేదీ ఉదయం 10 గంటలకు

(నృత్య విభాగంలో)

1. ఫోక్/ట్రైబల్ డ్యాన్స్, 2. క్లాసికల్ డ్యాన్స్

రంగస్థల విభాగంలో..

1. వన్ యాక్ట్ ప్లే, 2. స్కిట్స్, 3. మైమ్, 4. మిమిక్రీ

కరెంట్ షాక్‌తో ఇద్దరికి గాయాలు


కరెంట్‌షాక్‌కు గురైన కుమార్

మదనపల్లె : కరెంట్‌షాక్‌తో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ జన్మభూమికాలనీకి చెందిన కె.సుబ్బరత్నమ్మ(58), ఆమె కుమారుడు కె.కుమార్(32) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవిస్తున్నారు. సోమవారం యథావిధిగా పట్టణంలోని దిగువకమ్మపల్లె అభ్యుదయ స్కూల్ సమీపంలో పనులకు వెళ్లారు. భవనంపైన నిర్మాణ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కుమార్ మొదట విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతడితో పాటు తల్లి సుబ్బరత్నమ్మ సైతం షాక్‌కు గురైంది. ఘటనలో కుమార్‌కు తీవ్రగాయాలు కాగా, గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ముగిసిన డాక్టర్ బి.వెస్లీ అంత్యక్రియలు


డాక్టర్.బి.వెస్లీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రాయలసీమ దయాసిస్ బిషప్ వరప్రసాద్

మదనపల్లె : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) మాజీ డైరెక్టర్ డాక్టర్.బి.వెస్లీ అంత్యక్రియలు ముగిశాయి. క్షయవ్యాధి నివారణలో శానిటోరియం ఆస్పత్రిగా ప్రారంభమైన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ 1912లో ప్రారంభమైతే, అందులో 33 ఏళ్ల పాటు ఏఎంసీ డైరెక్టర్‌గా డాక్టర్.వెస్లీ సుదీర్ఘకాలం సేవలందించారు. ఆరోగ్యవరంలో టీబీ వ్యాధి టీకాలను కనుగొనేందుకు ల్యాబ్ ఏర్పాటుకు కృషిచేశారు. ఆరోగ్యవరం లోకల్ అథారిటీ అభివృద్ధిలో తనవంతుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది మేలో ఏఎంసీ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. అనంతరం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వెస్లీ సతీమణి షీలా, రెసిడెంట్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన కుమారుడు రిచర్డ్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఇంటిపట్టునే ఉంటున్న డాక్టర్.బి.వెస్లీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఓ క్రైస్తవ సోదరుడి ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గుండెపోటుతో ఉన్నపళంగా కుప్పకూలిపోయారు. దీంతో హుటాహుటిన ఆయనను ఆస్పత్రికి తరలించేలోపు మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శకుల కోసం ఆరోగ్యవరం రిక్రియేషన్ సెంటర్‌లో ఉంచారు. రాయలసీమ దయాసిస్ బిషప్ రెవరెండ్ వరప్రసాద్, జమ్మలమడుగు, పులివెందుల, గుత్తి, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి చర్చి పాస్టర్లు వచ్చి వెస్లీ మృతదేహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు దేశాయ్ తిప్పారెడ్డి, దొమ్మలపాటి రమేష్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్.ఎన్.రవికుమార్, రాటకొండ బాబురెడ్డి ఉన్నారు.

రైలు నుంచి జారిపడి డ్రైవర్ మృతి


మృతి చెందిన డ్రైవర్ కొండా సుమన్‌బాబు

ఓబులవారిపల్లె : చెన్నై– ముంబయి సూపర్ ఫాస్ట్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కొండా సుమన్ బాబు(33) అనే రైల్వే డ్రైవర్ మృతి చెందారు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు తిరుపతిలో నివాసం ఉంటున్న కొండా సుమన్ బాబు ఏడేళ్లుగా రైల్వే శాఖలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎర్రగుంట్లలో ఆయన విధులకు హాజరు కావాల్సి ఉండటంతో సోమవారం చెన్నై– ముంబయి సూపర్ ఫాస్ట్ రైలులో రేణిగుంట నుంచి ఎర్రగుంట్లకు స్లీపర్ కోచ్‌లో బయలుదేరారు. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌లో రైలు కాస్త వేగం తగ్గింది. ఇదే సమయంలో ప్రమాదవశాత్తు సుమన్‌బాబు రైలు నుంచి జారి కిందపడ్డారు. ప్లాట్‌ఫాంపై అరక్కోణం ప్యాసింజర్ రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేసుకొని గాయపడిన సుమన్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని రైల్వే అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.

శివకుమార్‌శర్మకు దైవజ్ఞ భూషణ అవార్డు


దైవజ్ఞ భూషణ అవార్డు అందుకుంటున్న వేదపండితుడు శివకుమార్‌శర్మ

మదనపల్లె సిటీ : జ్యోతిష్యశాస్త్రంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు మదనపల్లెకు చెందిన వేదపండితుడు శివకుమార్‌శర్మకు మహారాష్ట్ర రాష్ట్రం ఉజ్జయిని విక్రమాదిత్య యూనివర్సిటీ దైవజ్ఞ భూషణ అవార్డును అందజేసింది. ఉజ్జయినిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మధ్య ప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, యూనివర్సిటీ వీసీ అఖిలేష్‌కుమార్ పాండే చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శివకుమార్‌శర్మ అవార్డు అందుకోవడం పట్ల పలువురు వేదపండితులు, బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు


టిప్పర్‌ను అడ్డగిస్తున్న గ్రామస్తులు

వీరబల్లి (రాయచోటి టౌన్) : మండల పరిధిలోని గడికోట గ్రామం వేల్పుల మిట్ట గ్రామప్రజలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిని అడ్డగించి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో అక్రమంగా ఇసుకను తరలించడం ఎక్కువ కావడంతో తమ పొలాల వద్ద నదిలోని నీరు అడుగంటి పోతోందని గ్రామస్తులు అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించారు. దీంతో గ్రామస్తులే పంట పొలాల వద్ద కాపు కాసి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారి ఆట కట్టించాలని వారు కోరుతున్నారు.

అన్నదాత గుండె చెరువు.!

- తెగిన చెరువుతో నీటి పాలైన రైతన్నల రెక్కల కష్టం
- మట్టిపాలైన పెట్టుబడులు
- అన్నదాతల కలవరం
- నష్టంపై జిల్లా కలెక్టరుకు నివేదిక
- ఇరిగేషన్ ఈఈ సురేంద్ర రెడ్డి వెల్లడి


తెగిన శీతివారిపల్లె చెరువు

కురబలకోట : మండలంలోని దిగవశీతివారిపల్లె పక్కనున్న శీతివారిపల్లె చెరువు తెగిన సంఘటనపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఈ చెరువు తెగి వరదలా ప్రవాహం పోటెత్తిన విషయం తెలిసిందే. తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావు, వ్యవసాయాధికారి రాధ సంయుక్తంగా కట్ట తెగడం, పంట నష్టం వివరాలను బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు కింద 19 మంది రైతుల పంటలు నీటిపాలైనట్లు గుర్తించారు. వరి రెండు ఎకరాలు, వేరుశనగ నాలుగు ఎకరాలు, మొక్కజొన్న ఎనిమిది ఎకరాల్లో నష్టపోయినట్లు విచారణలో వెల్లడైంది. ఎక్కువగా భూపాల్ రెడ్డి పంటలు నష్టపోయారు. భూమిపై మట్టి మేటలు పేరుకుపోయాయి. పొలాన్ని యథాస్థితికి తెచ్చుకోవడం ఎలా అని ఆయన అధికారుల ముందు విలపించారు. 30 మంది రైతుల వ్యవసాయ మోటార్లు మట్టితో మూసుకుపోయాయి. ఈ చెరువుకు పైగా వెళుతున్న హంద్రీనీవా కాలువ కృష్ణా జలాలు లీకేజీ ద్వారా భారీగా నీళ్లు ఈ చెరువుకు చేరడంతో ఇది తెగడానికి కారణంగా చెబుతున్నారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తగిన నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో బాధితులను ఆదుకుంటామన్నారు. ఇదిలా ఉండగా తెగిన చెరువు నీరు దిగువన ఉన్న అప్పాలమ్మ చెరువుకు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం ఇరిగేషన్ అధికారులు హిటాచీ సాయంతో చెరువు పక్కన గ్రామస్తుల రాకపోకలకు వీలుగా కొత్తగా దారి సౌకర్యం కల్పించారు. మదనపల్లె ఇరిగేషన్ ఈఈ సురేంద్ర రెడ్డి స్వయంగా పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, వాహనాల రాకపోకలకు దారి ఏర్పాటు చేశారన్నారు. వెంటనే తెగిన చెరువు మరమ్మతు పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ చెరువుపైగా హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు సాగుతుండడంతో తిరిగి ఈ చెరువును పూర్తి స్థాయిలో నింపుతామని తెలిపారు. ఇందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

చెరువు తెగి నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. పంటల నష్టం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. చెరువు తెగడం దురదృష్టకరమన్నారు. పంటలు దెబ్బతింటే రైతులు ఎంత వేదన అనుభవిస్తారో తెలుసన్నారు. నియోజక వర్గ ప్రజలు తన కుటుంబమన్నారు. ఎవరికి కష్టం నష్టం జరిగినా తనకు జరిగినట్లే భావిస్తానన్నారు. రైతులు అధైర్య పడవద్దని తగిన రీతిలో ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.


నేలను తాకిన వరి పంట